మన రాజధాని
# రక్షణ
నిజం మా బలం
బాపట్ల | గుంటూరు | పల్నాడు
గురువారం 13 ఆగస్టు 2026 పేజీలు : 4

# రేపల్లె సబ్‌జైలులో ఖైదీ ఆత్మహత్యాయత్నం



వృద్ధురాలి హత్య కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న వి. శ్రీనివాసరావు రేపల్లె సబ్‌జైలులో కూరగాయలు కోసే కత్తితో గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో జైలు సిబ్బంది అతడిని తొలుత రేపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, అనంతరం తెనాలి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

2లో




ఎడిటర్
నరేంద్ర



సూర్యలంక అభివృద్ధి పనులపై కలెక్టర్ ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నప్పటికీ, గత కొద్దిరోజులుగా నిర్మాణాలు నిలిచిపోయిన విషయం ఆయన దృష్టికి రాలేదా? రెండు నెలల్లో పనులు పూర్తిచేసి పర్యాటకులకు అందుబాటులోకి తేవాల్సిన ప్రాజెక్టులో పనులే ఆగిపోతే ప్రభుత్వానికి నివేదిక ఎందుకు ఇవ్వలేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఎమ్మెల్యే స్పందించే వరకు అధికార యంత్రాంగం ఎందుకు మౌనంగా ఉంది? పనులు నిలిచిన అసలు కారణాలపై కలెక్టర్ స్పష్టత ఇవ్వాల్సిన అ వసరం ఉంది.

# సూర్యలంకలో షాడో రాజకీయం..

- ఎమ్మెల్యే ఆగ్రహం...
- సూర్యలంకలో జరుగుతున్న కథ ఏంటి
- పార్టీలోనే కొందరు పనులు నిలిపివేశారు అనేదానిపై ఎమ్మెల్యే ఆరా
- పనులు ఆపేసే అధికారం ఎవరికి ఉంది?
- 'సీఎం దగ్గర పంచాయితీ పెడతా'..
- ఎమ్మెల్యే నరేంద్రవర్మ వ్యాఖ్యలతో బాపట్లలో కలకలం

సూర్యలంక అభివృద్ధి పనుల విషయంలో బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ స్వరం పెంచడంతో అధికార, రాజకీయ వర్గాల్లో కదలిక మొదలైంది. ప్రభుత్వం కోట్లాది రూపా యలు వెచ్చించి చేపడుతున్న పర్యాటక ప్రాజెక్టుకు ఎవరి ఆదేశాలతో బ్రేకులు పడ్డాయన్నది ఇప్పుడు అసలు ప్రశ్నగా మారింది. పార్టీలోనే కొందరు స్వప్రయోజనాల కోసం అభివృద్ధిని అడ్డుకుంటున్నారన్న ఆరోపణల నేపథ్యంలో ఎమ్మెల్యే నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి అంశాన్ని తీసుకెళ్లేందుకు సిద్ధమవడం రాజకీయ ంగా చర్చనీయాం శమైంది.

వివరాలు 2లో..

సూర్యలంకలో ప్రైవేటు హోటల్ నిర్మాణానికి అడ్డంగా ఉందంటూ పర్యాటక శాఖ దాదాపు రూ.2 కోట్లతో నిర్మించిన భవనాన్ని తొలగించి, మరోచోట నిర్మాణం చేపట్టాలని ఓ రాజకీయ నాయకుడు ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. ఈ కారణంగానే పనులు నిలిచిపోయినట్లు ప్రచారం జరుగుతోంది. అదే నిజమైతే ప్రజాధనంతో నిర్మించిన ప్రభుత్వ ఆస్తిని కేవలం ఒక ప్రైవేటు నిర్మాణానికి అనుకూలంగా మార్చడం తీవ్రమైన విషయం. ఇప్పటికే ఖర్చు చేసిన కోట్ల రూపాయల నిధుల పరిస్థితి ఏమిటి? బాధ్యత ఎవరిది? నిబంధనలకు విరుద్ధంగా నిర్ణయం తీసుకుంటే ప్రభుత్వ నిధుల దుర్వినియోగానికి అది నిదర్శనంగా మారే ప్రమాదం ఉంది. దీనిపై ప్రభుత్వం వెంటనే సమగ్ర విచారణ చేపట్టి వాస్తవాలను బయటపెట్టాల్సిన అవసరం ఉంది.

# సీడ్ యాక్సెస్ రోడ్ ప్రారంభానికి సర్వం సిద్ధం

- సీఎం చేతుల మీదుగా స్టీల్ బ్రిడ్జిలు, సీడ్ యాక్సెస్ రోడ్ ప్రారంభం..
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ సాయికాంత్ వర్మ

రాజధాని అమరావతి అభివృద్ధిలో మరో కీలక ఘట్టానికి రంగం సిద్ధమైంది. సీడ్ యాక్సెస్ రోడ్, స్టీల్ బ్రిడ్జిల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం సీఎం చంద్రబాబు నాయుడు ప్రారంభించనుండగా, అనంతరం ఎమ్మెల్యేల నివాస సము దాయాలను పరిశీలించనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో భద్ర త, ట్రాఫిక్, పార్కింగ్ ఏర్పాట్లను అధికారులు పకడ్బందీగా చేపట్టారు.

గుంటూరు, రక్షణ న్యూస్



వివరాలు 2లో..

# సీడ్ యాక్సెస్ రోడ్ ప్రారంభానికి సర్వం సిద్ధం

మొదటి పేజీ తరువాయి

**గుంటూరు, రక్షణ న్యూస్**

రాజధాని అమరావతి అభివృద్ధిలో కీలకమైన సీడ్ యాక్సెస్ రోడ్, స్టీల్ బ్రిడ్జిల ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వీటిని ప్రారంభించనున్నారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేస్తున్నారు. కార్యక్రమం జరిగే ప్రాంతంలో భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్, ప్రజలకు అవసరమైన సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రారంభోత్సవ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ, అమరావతి అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ లక్ష్మీ పార్థసారథి బుధవారం పరిశీలించారు. స్టీల్ బ్రిడ్జి, సీడ్ యాక్సెస్ రోడ్ ప్రారంభం జరిగే ప్రాంతాలను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమానికి వచ్చే ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. స్టీల్ బ్రిడ్జి, సీడ్ యాక్సెస్ రోడ్ ప్రారంభోత్సవం అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. అనంతరం రాజధాని ప్రాంతంలో నిర్మిస్తున్న శాసనసభ్యుల నివాస గృహ సముదాయాలను సీఎం పరిశీలించనున్నారు. రాజధాని నిర్మాణ పనుల పురోగతితో పాటు మౌలిక వసతుల కల్పనపై సంబంధిత అధికారులతో సమీక్షించే అవకాశం ఉంది.

సీఎం పర్యటన నేపథ్యంలో పోలీసు శాఖ ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. కార్యక్రమానికి వచ్చే వాహనాల కోసం పార్కింగ్ ప్రాంతాలను గుర్తించడంతో పాటు ట్రాఫిక్ మళ్లింపులకు సంబంధించి ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. ప్రధాన మార్గాల్లో ట్రాఫిక్ రద్దీ ఏర్పడకుండా ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేశారు. బందోబస్తులో పాల్గొనే పోలీసు సిబ్బందికి విధులు, బాధ్యతలపై ముందస్తుగా అవగాహన కల్పించారు. రాజధాని ప్రాంతంలో సీఎం పర్యటన సజావుగా జరిగేలా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు. కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, పార్కింగ్, రాకపోకలు, భద్రత తదితర అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు కూడా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. సీడ్ యాక్సెస్ రోడ్ రాజధాని అమరావతిలో రవాణా వ్యవస్థకు కీలకమైన మార్గంగా అధికారులు పేర్కొంటున్నారు. రాజధాని ప్రాంతంలోని వివిధ ప్రాంతాలను అనుసంధానించడంతో పాటు భవిష్యత్‌లో పెరిగే వాహన రద్దీకి అనుగుణంగా రహదారి వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నారు. స్టీల్ బ్రిడ్జిలు అందుబాటులోకి రావడంతో రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, సీఆర్‌డీఏ అదనపు కమిషనర్ కొల్లాబత్తుల కార్తీక్, తెనాలి రెవెన్యూ డివిజనల్ అధికారి కె. శ్రీరమణి, గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజినీర్ కె. కళ్యాణ చక్రవర్తి, ఎంటీఎంసీ కమిషనర్ అలీం భాషా, జిల్లా పౌర సరఫరాల అధికారి పి. కోమలి పద్మ, అదనపు ఎస్పీ రవి కుమార్, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగ సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సూర్యలంకలో షాడో రాజకీయం..

మొదటి పేజీ తరువాయి

**ఎడిటర్ నరేంద్ర...**

బాపట్లకు గుర్తింపుగా ఉన్న సూర్యలంకను గోవా తరహాలో అంతర్జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చేపట్టిన రూ.97 కోట్ల అభివృద్ధి పనులకు బ్రేకులు పడటంపై రాజకీయ దుమారం రేగుతోంది. పనులు నిలిచిపోవడంపై స్వయంగా ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అసంతృప్తి వ్యక్తం చేయడం అధికార, రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. అభివృద్ధిని అడ్డుకుంటున్నది ఎవరు? ఎందుకు? దీని వెనుక రాజకీయ ప్రయోజనాలున్నాయా? అన్న ప్రశ్నలు ఇప్పుడు బాపట్లలో హాట్‌టాపిక్‌గా మారాయి. బాపట్ల అనగానే సూర్యలంక.. సూర్యలంక అనగానే బాపట్ల గుర్తుకొచ్చే స్థాయిలో ఈ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు ఉంది. సహజసిద్ధమైన బీచ్ అందాలను వినియోగించుకుని పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తే బాపట్ల ఆర్థిక వ్యవస్థలోనే మార్పు వస్తుందన్నది ప్రభుత్వ ఆలోచన. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ దృష్టితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులను సమీకరించి సూర్యలంకను అత్యాధునిక పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించారు. రూ.97 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో పర్యాటకులకు అవసరమైన మౌలిక వసతులు, పార్కింగ్, వసతి, ఆధునిక స్నానపు గదులు, ఇతర సౌకర్యాలు కల్పించే నిర్మాణాలు ఉన్నాయి. ఈ పనులు పూర్తయితే బాపట్ల జిల్లాకే కాకుండా రాష్ట్ర పర్యాటక రంగానికీ సూర్యలంక మరో ఆకర్షణగా మారే అవకాశం ఉంది. ఇప్పటికే సూర్యలంకకు పర్యాటకుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది. ఇక్కడే అసలు వివాదం మొదలైంది. పనులు వేగంగా సాగుతున్న సమయంలో కొంతకాలంగా కొన్ని నిర్మాణ పనులు నిలిచిపోయినట్లు తెలుస్తోంది. సాధారణంగా ప్రభుత్వ ప్రాజెక్టు పనుల్లో జాప్యం జరిగితే అధికార యంత్రాంగం కారణాలను వెల్లడించాలి. కానీ సూర్యలంక విషయంలో పనులు ఎందుకు ఆగాయి? ఎవరి ఆదేశాలతో ఆగాయి? ఎలాంటి అభ్యంతరాలు వచ్చాయి? వాటిని పరిష్కరించేందుకు ఏ చర్యలు తీసుకున్నారు? అన్న విషయాల్లో స్పష్టత లేకపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఈ అంశంపై ఎమ్మెల్యే నరేంద్రవర్మ తీవ్రంగా స్పందించినట్లు తెలుస్తోంది. సూర్యలంక అభివృద్ధి పనులను వ్యక్తిగత లేదా రాజకీయ ప్రయోజనాల కోసం ఎవరైనా అడ్డుకుంటే సహించేది లేదన్న సంకేతాలను ఆయన ఇచ్చారు. అవసరమైతే మొత్తం వ్యవహారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి తేల్చుకుంటానని చెప్పడం ఇప్పుడు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. అభివృద్ధి పనులు ఆపే అధికారం ఎవరికి? అన్న ప్రశ్న కూడా తెరపైకి వచ్చింది. ప్రభుత్వ నిధులతో, ప్రభుత్వ సంస్థల ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రాజెక్టులను నిలిపివేయాలంటే నిబంధనల ప్రకారం స్పష్టమైన కారణం ఉండాలి. సాంకేతిక సమస్యలున్నాయా? డిజైన్‌లో మార్పులు అవసరమా? పర్యావరణ అనుమతుల అంశమా? ప్రైవేటు నిర్మాణాలకు సంబంధించిన వివాదమా? లేక మరేదైనా కారణమా? ప్రభుత్వం దీనిపై ప్రజలకు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఇదే సమయంలో సూర్యలంకలో ప్రైవేటు హోటళ్ల నిర్మాణానికి అనుమతులు ఇవ్వడం మరో చర్చకు కారణమవుతోంది. గోవా తరహాలో సూర్యలంకను అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ ప్రణాళికలో ప్రభుత్వ పర్యాటక సదుపాయాలు, ప్రైవేటు హోటళ్ల మధ్య సరైన సమన్వయం అవసరం. కానీ ప్రభుత్వ ఆధ్వర్యంలో కోట్లాది రూపాయలతో నిర్మిస్తున్న భవనాలకు ఎదురుగా ప్రైవేటు హోటళ్ల నిర్మాణాలు వస్తే భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం నిర్మిస్తున్న ఆధునిక భవనాల్లో పర్యాటకులకు అవసరమైన స్నానపు గదులు, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఇలాంటి శాశ్వత మౌలిక వసతులు భవిష్యత్‌లో వేలాది మంది పర్యాటకులకు ఉపయోగపడతాయి. అలాంటి నిర్మాణాలు ప్రైవేటు హోటల్ వ్యాపారానికి అడ్డంకిగా మారతాయనే కారణంతో ప్రభుత్వ ప్రాజెక్టును వెనక్కి తీసుకోవడం ఎంతవరకు సమంజసం? అన్నదే ఇప్పుడు కీలక ప్రశ్న. సూర్యలంక అభివృద్ధిలో రాజకీయ జోక్యం ఉందనే ప్రచారం కూడా స్థానికంగా ఊపందుకుంటోంది. అయితే ఎవరైనా నాయకుడి పేరు అధికారికంగా నిర్ధారణ కాలేదు. కాబట్టి ఆరోపణలను వాస్తవాలుగా కాకుండా, వాటిపై సమగ్ర విచారణ అవసరమనే కోణంలో చూడాల్సి ఉంటుంది. ప్రభుత్వ ప్రాజెక్టును ఎవరు అడ్డుకున్నారనే విషయం అధికారికంగా తేల్చడం ప్రభుత్వ బాధ్యత. ఈ వ్యవహారంలో ఎమ్మెల్యే నరేంద్రవర్మ వైఖరి మాత్రం రాజకీయంగా కీలకంగా మారింది. నియోజకవర్గానికి భారీ పెట్టుబడి, పర్యాటక అభివృద్ధి, ఉపాధి అవకాశాలు తీసుకురావాల్సిన ప్రాజెక్టు విషయంలో స్థానిక రాజకీయ ప్రయోజనాలకు తావులేకుండా పనులు పూర్తి చేయాలన్నదే ఆయన వాదనగా కనిపిస్తోంది. సొంత పార్టీకి చెందిన వారైనా ప్రజా ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే ప్రశ్నిస్తానన్న ధోరణి ఆయన వ్యాఖ్యల్లో కనిపించడం ఇప్పుడు చర్చనీయాంశమైంది.

మరోవైపు జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ కూడా సూర్యలంక అభివృద్ధిపై గతంలో సమీక్షలు నిర్వహించారు. గోవా తరహాలో సూర్యలంకను తీర్చిదిద్దే లక్ష్యంతో క్షేత్రస్థాయి పరిశీలనలు కూడా జరిగినట్లు సమాచారం. అలాంటప్పుడు పనులు మందగించినా జిల్లా యంత్రాంగం ఎందుకు వేగంగా స్పందించలేదన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. పనులు నిలిచిపోయిన కారణాలు, ఇప్పటివరకు జరిగిన పురోగతి, మిగిలిన పనుల గడువు తదితర అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన నివేదిక విడుదల చేస్తే అనేక అనుమానాలకు తెరపడుతుంది. బాపట్ల ప్రజలు కోరుకుంటున్నది రాజకీయ వివాదం కాదు.. అభివృద్ధి. సూర్యలంకకు వచ్చే పర్యాటకులకు పార్కింగ్ ఉండాలి. నాణ్యమైన వసతి ఉండాలి. సురక్షితమైన స్నానపు గదులు ఉండాలి. పరిశుభ్రమైన పరిసరాలు ఉండాలి. కుటుంబాలతో వచ్చే వారికి అవసరమైన అన్ని సదుపాయాలు ఉండాలి. ఇవన్నీ కల్పించడమే ప్రభుత్వ ప్రాజెక్టు లక్ష్యమైతే, ఆ పనులకు ఎలాంటి కారణంతోనైనా బ్రేకులు పడటం ప్రజలకు ఆమోదయోగ్యం కాదు. సూర్యలంక అభివృద్ధి ద్వారా స్థానిక హోటళ్లు, రవాణా, చిరు వ్యాపారాలు, హస్తకళలు, ఆహార కేంద్రాలు, పర్యాటక సేవలు విస్తరించే అవకాశం ఉంది. యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. బాపట్ల పేరు పర్యాటక పటంలో మరింత బలపడుతుంది. అందుకే ఈ ప్రాజెక్టును ఒక సాధారణ నిర్మాణ పనిగా కాకుండా జిల్లాకు భవిష్యత్ ఆస్తిగా చూడాల్సిన అవసరం ఉంది. ఇప్పుడు ప్రభుత్వం తేల్చాల్సింది ఒక్కటే. సూర్యలంక పనులు ఎందుకు ఆగాయి? ఎవరి వల్ల ఆగాయి? నిబంధనల ప్రకారమే ఆగాయా? లేక రాజకీయ జోక్యంతోనా? అన్న ప్రశ్నలకు సమాధానం చెప్పాలి. ఎమ్మెల్యే నరేంద్రవర్మ ఇప్పటికే ఈ అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లే సంకేతాలు ఇవ్వడంతో ఇప్పుడు అందరి చూపు ప్రభుత్వంపై పడింది. సూర్యలంక అభివృద్ధి రాజకీయాలకు బలికావాలా? లేక బాపట్ల భవిష్యత్తుకు బాటవేయాలా? అన్నది తేలాల్సిన సమయం వచ్చింది. రూ.97 కోట్ల ప్రజాధనం ఖర్చవుతున్న ప్రాజెక్టులో పారదర్శకత, వేగం, నాణ్యతపై ప్రభుత్వం స్పష్టమైన వైఖరి ప్రకటించి, నిలిచిపోయిన పనులకు వెంటనే పరిష్కారం చూపాలని బాపట్ల ప్రజలు కోరుతున్నారు.

# రేపల్లె సబ్‌జైలులో ఖైదీ ఆత్మహత్యాయత్నం


**రేపల్లె, రక్షణ న్యూస్:**

రేపల్లె సబ్‌జైలులో రిమాండ్ ఖైదీ ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం కలకలం రేపింది. వృద్ధురాలి హత్య కేసులో అరెస్టయిన వి. శ్రీనివాసరావు రిమాండ్ ఖైదీగా సబ్‌జైలులో ఉన్నాడు. ఈ క్రమంలో జైలులోని వంటగదిలో ఉన్న కూరగాయలు కోసే కత్తితో తన గొంతు కోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు సమాచారం. ఖైదీ తీవ్ర రక్తస్రావంతో ఉండటాన్ని గమనించిన జైలు సిబ్బంది వెంటనే అప్రమత్తమై అతడిని రేపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ప్రాథమిక చికిత్స అందించారు. అయితే పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తెనాలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో వైద్యుల సిఫార్సు మేరకు శ్రీనివాసరావును అనంతరం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు అధికారులు తెలిపారు. ఘటనకు దారితీసిన పరిస్థితులు, ఖైదీ కత్తిని ఎలా అందుబాటులోకితెచ్చుకున్నాడు? అనే అంశాలపై కూడా దర్యాప్తు కొనసాగుతోంది. జైలు అధికారుల ఫిర్యాదు మేరకు రేపల్లె పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి ఘటనపై దర్యాప్తు చేపట్టారు. ఖైదీ ఆత్మహత్యాయత్నానికి పాల్పడటానికి గల కారణాలు, జైలులో భద్రతా ఏర్పాట్లపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

# మార్టూరు టీడీపీ కమిటీ

**రక్షణ న్యూస్ -- మార్టూరు:**

తెలుగుదేశం పార్టీ మార్టూరు మండల నూతన కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా శివరాత్రి శ్రీనివాసరావు, గొట్టిపాటి వెంకట్రావు నియమితులయ్యారు. పార్టీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నూతన కమిటీని ప్రకటించారు.గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంతోపాటు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, సమష్టిగా పనిచేసి మార్టూరు మండలంలో పార్టీని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు.నూతన కమిటీలో ఉపాధ్యక్షుడిగా జొన్నలగడ్డ యేసుపాదం, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా పాలేపు జానకిరామయ్య, తన్నీరు శ్రీనివాసరావు, షేక్ కరీముల్లా, కార్యదర్శులుగా పోలా చిట్టిబాబు, చెన్నుపాటి అంజనేయులు,



తన్నీరు రామాంజనేయులు, కోశాధికారిగా తల్లూరి రమేష్ నియమితులయ్యారు. ఎమ్మెల్యే నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు.

# ఈ-ఆటోలతో రోజుకు వెయ్యి ఇళ్ల చెత్త సేకరణ

**రక్షణ న్యూస్ -- గుంటూరు:**

నగరంలోని పారిశుధ్య నిర్వహణను మరింత పటిష్ఠం చేయాలని గుంటూరు నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ అధికారులను ఆదేశించారు. ప్రతి వార్డుకు కేటాయించిన ఈ-ఆటోలు రోజుకు కనీసం వెయ్యి ఇళ్ల నుంచి చెత్త సేకరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. బుధవారం శ్యామలనగర్, రాజేంద్రనగర్, బృందావన్ గార్డెన్స్ ప్రాంతాల్లో ఇంటింటి చెత్త సేకరణను పరిశీలించారు.ఈ-ఆటోలు ఉదయం 6 గంటలకే వార్డుల్లో ఉండాలని, ప్రతి వాహనానికి రూట్‌మ్యాప్ ఉండాలని కమిషనర్ స్పష్టం చేశారు. వార్డుల్లో వందశాతం చెత్త సేకరణ జరగాలని, ఖాళీ స్థలాలను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. కార్మికుల హాజరును ఫేషియల్ రికగ్నిషన్ ద్వారా నమోదు చేయాలని, బహిరంగంగా చెత్త వేసేవారిపై స్వచ్ఛ




యాప్ ద్వారా జరిమానాలు విధించాలని సూచించారు. బల్క్ వేస్ట్ జనరేటర్లకు నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు.

# రెవెన్యూ సేవలు ఇక ఆన్‌లైన్‌లోనే



**రక్షణ న్యూస్ -- గుంటూరు:**

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో రెవెన్యూ సేవలకు ఇకపై ఆన్‌లైన్ విధానాన్నే తప్పనిసరి చేస్తూ కమిషనర్ కె.మయూర్ అశోక్ ఆదేశాలు జారీ చేశారు. ఆస్తిపన్ను, ఖాళీ స్థలాల పన్ను, పేరు మార్పు, టైటిల్ ట్రాన్స్‌ఫర్, సబ్‌డివిజన్, అమాల్గమేషన్, పన్ను మినహాయింపులు తదితర సేవలకు ఈఆర్పీ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారానే దరఖాస్తు చేసుకోవాలని స్పష్టం చేశారు.మాన్యువల్ లేదా పేపర్ దరఖాస్తులను అధికారులు, సిబ్బంది స్వీకరించకూడదన్నారు. ప్రతి సేవకు పరిష్కార గడువును నిర్ణయించినట్లు తెలిపారు. కొత్త ఆస్తిపన్ను, పన్ను మార్పులు, టైటిల్ ట్రాన్స్‌ఫర్, పన్ను మినహాయింపులు, సబ్‌డివిజన్, అమాల్గమేషన్ వంటి సేవలను గరిష్టంగా 15 రోజుల్లో పూర్తి చేయాలని, రివిజన్ పిటిషన్లను 31 రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. గడువులోగా సేవలు అందించని అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# డ్రైన్లలో కన్వేయర్ బెల్టులు



**రక్షణ న్యూస్ -- గుంటూరు:**

నగరంలోని ప్లాస్టిక్ వ్యర్థాలు అధికంగా ఉండే ప్రధాన డ్రైన్లలో 15 రోజుల్లోగా కన్వేయర్ బెల్టులు ఏర్పాటు చేయాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థలో బుధవారం ఇంజినీరింగ్ అధికారులతో నిర్వహించిన సమీక్షలో పలు సూచనలు చేశారు.త్రాగునీటి సరఫరా సమయంలో ఏఈలు, వార్డు కార్యదర్శులు క్షేత్రస్థాయిలో ఉండాలని, ఈఎల్ఎస్ఆర్‌లు, ఇళ్ల వద్ద వందశాతం నీటి నమూనాలు సేకరించాలని సూచించారు. ప్రధాన డ్రైన్లలో రెండో విడత పూడికతీత పనులను శనివారంలోగా పూర్తి చేయాలని, కల్వర్టుల వద్ద సిల్ట్‌ను పూర్తిగా తొలగించాలని ఆదేశించారు. రహదారులపై గుంతలను వారం రోజుల్లో పూడ్చాలని, స్ట్రీట్ లైట్లు వందశాతం పనిచేసేలా చూడాలని స్పష్టం చేశారు. అభివృద్ధి పనులను వేగవంతం చేసి, ప్రజల ఫిర్యాదులను నిర్ణీత గడువులో పరిష్కరించాలని ఆదేశించారు.

# గురజాలలో ప్రెస్ క్లబ్ సేవలు

**రక్షణ న్యూస్ -- గురజాల:**




గురజాల ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో భవిత మానసిక వికలాంగుల ప్రభుత్వ పాఠశాల, సూర్యకిరణ్ మానసిక వికలాంగుల పాఠశాల విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం ఎదుట ప్రజలు, బాటసారులకు పులిహోర పంపిణీ నిర్వహించారు.కార్యక్రమానికి గురజాల సీఐ మురళి, ఎస్సై వినోద్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై పులిహోర పంపిణీని ప్రారంభించారు. గంగవరం గ్రామంలోని అక్షయ ఫౌండేషన్ వృద్ధాశ్రమానికి 50 కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కార్యవర్గ సభ్యులు కందుల వెంకయ్య, షేక్ సుభాని, కనకం సుధాకర్‌నాయుడు, పాగాల కృష్ణారావు, గర్నెపూడి బాబు, పులిగుజ్జుల రవికిరణ్, చెవిటి వెంకట శివ తదితరులు పాల్గొన్నారు.

# టీకాలపై ఏఎన్ఎంలకు అవగాహన

**రక్షణ న్యూస్ -- ముండ్లమూరు:**



ముండ్లమూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కమలాశ్రీ సందర్శించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎంలతో సమావేశమై టీకాల నిర్వహణపై పలు సూచనలు చేశారు.టీకాలు వేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, టీకా అనంతరం రియాక్షన్ వచ్చినప్పుడు వెంటనే చేపట్టాల్సిన చర్యలు, పాటించాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు. వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని నిబంధనల ప్రకారం సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం. జాస్మిన్, డాక్టర్ వెంకటేశ్వరరెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ సుబ్బారావు, హెచ్‌వీ పద్మావతి పాల్గొన్నారు.

# సేవా కార్యక్రమాల్లో ప్రెస్ క్లబ్




**రక్షణ న్యూస్ -- గురజాల:**

గురజాల ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రజలు, బాటసారులకు పులిహోర పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ప్రెస్ క్లబ్ సభ్యుల నిర్ణయం మేరకు చేపట్టిన ఈ కార్యక్రమాన్ని గురజాల సీఐ మురళి ప్రారంభించారు.ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జర్నలిస్టులు వార్తల సేకరణకే పరిమితం కాకుండా సామాజిక బాధ్యతతో సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సామాజిక సేవ చేయడం ద్వారా జర్నలిస్టులు తమ బాధ్యతను మరింత విస్తరించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 8/13/2026 1:43 AM Page 4



# కృష్ణవేణికి నివాళులు అర్పించిన మాజీ సైనికులు



కర్లపాలెం రక్షణ న్యూస్

కర్లపాలెం మండలం గణపవరం సెగ్మెంట్ ఎంపీటీసీ సభ్యురాలు దిండి నాగలక్ష్మి సుబ్బారావు గారి అత్త స్వర్గీయ శ్రీమతి దిండి కృష్ణవేణి గారి పెద్దకర్మ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీటీసీ సభ్యులు తాంద్ర సాంబశివరావు హాజరై కృష్ణవేణి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాగలక్ష్మి సుబ్బారావు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్లపాలెం మండల పరిషత్ ఉపాధ్యక్షులు పందరబోయిన సుబ్బారావు, మండల వైసీపీ అధ్యక్షులు ఎల్లవుల ఏడుకొండలు, చింతాయపాలెం ఎంపీటీసీ సభ్యులు రాతంశెట్టి లక్ష్మణ్, ప్రముఖ వ్యాపారవేత్త పేరాల సురేష్, నాయకులు ఆట్ల నాగేశ్వరరెడ్డి, మందపాటి పరమానందకుమార్, స్వామిరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు కూచిపూడి సామ్యేలు (అమోస్) తదితరులు పాల్గొని కృష్ణవేణికి నివాళులర్పించారు.

# ప్రతి ఇంటా సంక్షేమ ఫలాలు



బాపట్ల రక్షణ న్యూస్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల కాలంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ప్రతి ఇంటికీ సంక్షేమం, అభివృద్ధి ఫలాలను అందిస్తోందని బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ రాజు తెలిపారు. బాపట్ల పట్టణంలోని 17వ వార్డులో కూటమి ప్రభుత్వం చేపట్టిన 'రెండేళ్ల నమ్మకం--సంక్షేమం--అభివృద్ధి' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన 'ఇంటింటికీ తెలుగుదేశం' ప్రచారంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి ప్రజలతో మాట్లాడి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా అవగాహన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ముఖ్యమంత్రి నాయకత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అందించడంతో పాటు అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ప్రజల కష్టసుఖాల్లో తోడుగా ఉంటూ బాపట్ల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందంజలో నిలపడమే తన లక్ష్యమన్నారు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అభివృద్ధి బాటలో వెల్లటూరు

భట్టిప్రోలు రక్షణ న్యూస్

కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో వెల్లటూరు గ్రామానికి సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా భారీగా నిధులు అందించిందని వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు తెలిపారు. 'రెండేళ్ల నమ్మకం--అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమంలో భాగంగా భట్టిప్రోలు మండలం వెల్లటూరులో ఎమ్మెల్యే ఇంటింటి ప్రచారం నిర్వహించి ప్రజలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా తల్లికి వందనం, మహిళా శక్తి, అన్నదాత సుఖీభవ, దీపం--2, ఎన్టీఆర్ భరోసా తదితర సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వీయిణా యాప్‌లో నమోదు చేశారు. వెల్లటూరు గ్రామానికి వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.12.07 కోట్ల ప్రయోజనాలు అందుతున్నాయని ఎమ్మెల్యే తెలిపారు. 32 మంది లబ్ధిదారులకు జిఓఖీ ద్వారా రూ.20.11 లక్షల వైద్య సహాయం అందించామన్నారు. గ్రామ అభివృద్ధికి రూ.5.71 కోట్ల విలువైన పనులు, అనుమతులు, ప్రతిపాదనలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇందులో జజ రోడ్లు, పాఠశాల ప్రహరీ గోడ, పౌల్ట్రీ అభివృద్ధి, కస్టమ్ హైరింగ్ సెంటర్, విద్యుత్ సబ్‌స్టేషన్ తదితర పనులు ఉన్నాయని వివరించారు. గౌడపాలెంలో రూ.9 లక్షలతో నిర్మించిన అశ్వద్ నారాయణ--మహాలక్ష్మి కమ్యూనిటీ హాల్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తామని నక్కా ఆనంద్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# స్మశాన స్థలాలు కేటాయించాలి

బాపట్ల రక్షణ న్యూస్

బాపట్ల జిల్లాలో స్మశాన స్థలాలు లేని దళితవాడలకు వెంటనే స్థలాలు కేటాయించి, దళిత కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు డి. రమాదేవి డిమాండ్ చేశారు. ఈ నెల 24న కలెక్టరేట్ వద్ద నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బాపట్లలో ప్రజా సంఘాల జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. సీపీఎం నిర్వహించిన సర్వేలో జిల్లాలోని 50 గ్రామాల్లో సుమారు 30 గ్రామాల్లో దళితులకు స్మశాన వాటికల సమస్య ఉన్నట్లు గుర్తించామన్నారు. అనేక దళితవాడల్లో తాగునీరు, రహదారులు, ఇళ్ల స్థలాలు, మౌలిక వసతుల కొరత తీవ్రంగా ఉందన్నారు. దళితులపై వివక్షను అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. గత ఏడాది కృష్ణానది వరదలు, మోంథా తుఫాను కారణంగా నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నష్టపరిహారం విడుదల చేయకపోతే రైతులతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ నెల 24న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద దళిత, ప్రజా సంఘాలతో కలిసి ధర్నాలు నిర్వహించి వినతిపత్రాలు అందజేస్తామని తెలిపారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సి. హెచ్. గంగయ్య, నాయకులు టి. కృష్ణమోహన్, ఎన్. బాబురావు, సి. హెచ్. మాణిలాల్ తదితరులు పాల్గొన్నారు.




# కారంపూడి ఎస్సై సస్పెన్షన్ ఎత్తివేత

కారంపూడి రక్షణ న్యూస్



కారంపూడి ఎస్సై వాసుపై విధించిన సస్పెన్షన్‌ను ఉన్నతాధికారులు ఎత్తివేశారు. మండలంలో మహిళ ఆత్మహత్యాయత్నం ఘటన నేపథ్యంలో ఎస్సై వాసును సస్పెండ్ చేస్తూ గతంలో అధికారులు చర్యలు తీసుకున్నారు. మిర్చి వ్యాపారంలో ఆర్థిక నష్టం ఎదుర్కొన్న ఓ వ్యక్తిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించిన నేపథ్యంలో తనకు ఇబ్బందులు ఎదురయ్యాయని ఆరోపిస్తూ అతని భార్య పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన అప్పట్లో కలకలం రేపింది. ఈ ఘటనపై పోలీసు ఉన్నతాధికారులు విచారణ చేపట్టి ఎస్సై వాసును సస్పెండ్ చేశారు. తాజాగా మంగళవారం విచారణ అనంతరం సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఎస్సై వాసుపై వచ్చిన పలు ఆరోపణల్లో వాస్తవం లేదని విచారణలో తేలినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. నిజమైన మిర్చి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని అధికారులు పేర్కొన్నారు.

# త్రివర్ణ పతాకంతో మానవహారం



బాపట్ల రక్షణ న్యూస్

80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా బాపట్ల మున్సిపల్ హైస్కూల్ మైదానంలో 100 మీటర్ల త్రివర్ణ పతాకంతో మానవహారం నిర్వహించారు. నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని రాజశ్రీ జెండా ఊపి త్రివర్ణ పతాక ప్రదర్శనను ప్రారంభించారు. విద్యార్థులు స్వాతంత్ర్య దినోత్సవానికి సంబంధించిన నినాదాలు చేస్తూ జాతీయ జెండాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ చైర్మన్, శ్రీ భావపురి విద్యాసంస్థల ప్రిన్సిపాల్ ఆవల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. 100 మీటర్ల త్రివర్ణ పతాక ప్రదర్శన ద్వారా విద్యార్థుల్లో స్వాతంత్ర్య దినోత్సవం, జాతీయ జెండా ప్రాముఖ్యతపై అవగాహన కల్పించడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో నేచర్ వెల్ఫేర్ కౌన్సిల్ డైరెక్టర్లు గురజాల శ్రీనివాసరావు, పొందుగల ప్రసాదరావు, ఇంకొల్లు పోలీసులు, ఉప్పె నరసింహారావు, ఆర్టీఐ ప్రతినిధి నాగప్రసాద్, వీరాస్వామి, పాఠశాల ఉపాధ్యాయులు సత్యనారాయణ, కే. శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 8/13/2026 1:43 AM Page 5



# వీధిలైట్లకు మోక్షమెప్పుడో....?

**నాలుగు నెలలుగా చిమ్మ చీకట్లో కాలనీ వాసులు...**

**రాత్రివేళ లైట్లు లేక రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు..**

**కమిషనర్ జోక్యంపై కాలనీవాసుల ఆశలు**

బాపట్ల రక్షణ న్యూస్

జిల్లా కేంద్రంలో ఐఏఎస్, ఐపీఎస్, గ్రేడ్-1 స్థాయి అధికారులతో కూడిన యంత్రాంగం ఉన్నప్పటికీ, చిన్నపాటి పౌర సమస్య పరిష్కారానికి నాలుగు నెలల సమయం పడుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాపట్ల ఏడో వార్డు జగజ్జీవన్ నగర్ కాలనీలో వీధిలైట్లు వెలగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బాపట్ల పట్టణం లోని 11వ వార్డు జగజ్జీవన్ నగర్ కాలనీలో నాలుగు నెలలుగా వీధిలైట్ల సమస్య పరిష్కారానికి నోచుకోకపోవడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. సమస్యను పరిష్కరించాలని కోరుతూ పలుమార్లు మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరిగి సిబ్బందికి విన్నవించినా ఫలితం లేకపోయిందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. తమ గోడును పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**చీకటిలో చిన్నారులకు ప్రమాదం...**వీధిలైట్లు లేకపోవడంతో రాత్రివేళ కాలనీ మొత్తం చీకటిమయంగా మారుతోందని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు రాత్రివేళ రాకపోకలు సాగించేటప్పుడు దారి కనిపించక ఇబ్బందులు పడుతున్నారని, చీకటిలో సైడ్ కాలువల్లో పడిపోయిన ఘటనలు కూడా



చోటుచేసుకున్నాయని కాలనీ పెద్దలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళలు, వృద్ధులు సైతం రాత్రివేళ బయటకు రావాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొందని పేర్కొంటున్నారు.

**మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేదు...** వీధిలైట్ల సమస్యపై మున్సిపల్ సిబ్బందికి పలుమార్లు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. సమస్యను పరిష్కరించాల్సిన సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడుతున్నారు. జిల్లా హెడ్‌క్వార్టర్‌లోనే పౌర సమస్యలకు ఈ పరిస్థితి ఉంటే సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

**కమిషనర్ జోక్యంపై కాలనీవాసుల ఆశలు...**ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ ప్రత్యేకంగా దృష్టి సారించి జగజ్జీవన్ నగర్ కాలనీలో వీధిలైట్ల సమస్యను తక్షణమే పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు. రాత్రివేళ చిన్నారులు, మహిళలు, వృద్ధుల భద్రతను దృష్టిలో ఉంచుకుని సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# మరుప్రోలు కుటుంబానికి గాదె పరామర్శ



కర్లపాలెం రక్షణ న్యూస్

మండల మాజీ జెడ్పీటీసీ సభ్యులు మరుప్రోలు శివారెడ్డి మాతృమూర్తి కీర్తిశేషులు నాంచారమ్మ మృతికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి, పర్చూరు నియోజకవర్గ సమన్వయకర్త గాదె మధుసూదనరెడ్డి, చీరాల నియోజకవర్గ అబ్జర్వర్, రాష్ట్ర కార్యదర్శి మోదుగుల బసవ పున్నారెడ్డి సంతాపం తెలిపారు.దిండు వారిపాలెం గ్రామంలో నాంచారమ్మ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించి, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.వారి వెంట గోవతోటి విజయ్, పరమానందకుమార్, గోగ్రుముచ్చు ఆనందరావు, దేగల రవిరెడ్డి, నర్రా నాగశ్రీను, పులుగు సుబ్బారెడ్డి, మరుప్రోలు సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొని నాంచారమ్మకు నివాళులర్పించారు.

# విద్యార్థులతో కలెక్టర్ సైకిల్ ర్యాలీ



బాపట్ల రక్షణ న్యూస్

80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బాపట్లలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ వి. విద్యార్థులతో కలిసి సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు. పురపాలక ఉన్నత పాఠశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ పెదనందిపాడు ఫ్లైఓవర్ సమీపంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు సాగింది. పురపాలక కమిషనర్ ఎం. హాసిని పచ్చజెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.అంబేద్కర్ విగ్రహం వద్ద కలెక్టర్ విద్యార్థులతో స్వాతంత్ర్య దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. భారత సార్వభౌమత్వం, సమగ్రతను కాపాడుతూ వికసిత్ భారత్--2047, స్వర్ణాంధ్రప్రదేశ్ లక్ష్యాల సాధనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. దేశభక్తి, జాతీయ సమైక్యతను పెంపొందించేందుకు జిల్లాలోని అన్ని మండలాల్లో సైకిల్ ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఆగస్టు 13న రేపల్లెలో, ఆగస్టు 14న చీరాలలో సైకిల్ ర్యాలీలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్డీఓ హరికుమార్, డీఈఓ శ్రీనివాస్ సింగ్, తహసీల్దార్ సలీమా, ఇతర అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎల్‌నినోను తట్టుకునే ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



నరసరావుపేట: రక్షణ న్యూస్

ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం లోటు, అధిక ఉష్ణోగ్రతలు, నీటి కొరత వంటి పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులను ప్రత్యామ్నాయ వ్యవసాయ పద్ధతులపై చైతన్యపరిచేందుకు రూపొందించిన అవగాహన పోస్టర్లను జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతిక శుక్ల ఆవిష్కరించారు.కలెక్టరేట్‌లోని శంకరన్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన ప్రైమరీ సెక్టార్ యాక్షన్ ప్లాన్ సమావేశంలో జిల్లా అధికారుల సమక్షంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కే. అమలకుమారి రూపొందించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు.ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు నేలలో తేమను సంరక్షించడం, తక్కువ నీటితో పంటలు సాగు చేయడం, పంటల వైవిధ్యాన్ని పాటించడం, అంతర పంటలను ప్రోత్సహించడం, ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించడం వంటి అంశాలను పోస్టర్లలో పొందుపరిచారు.'రైతన్న మీకోసం' కార్యక్రమం ద్వారా ఈ పోస్టర్లను రైతులకు చేరవేసి, వాతావరణ ప్రతికూల పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనే ప్రకృతి వ్యవసాయ విధానాలపై విస్తృత అవగాహన కల్పించనున్నారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులను ముందస్తుగా సన్నద్ధం చేయడంతోపాటు జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించడమే లక్ష్యమని అధికారులు తెలిపారు.కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎం. జగ్గారావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి వెంకటరావు, డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి, ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కే. అమలకుమారి తదితరులు పాల్గొన్నారు.

# నీటి లభ్యత లేనందున వరి సాగు చేయవద్దు

నరసరావుపేట: రక్షణ న్యూస్

జిల్లాలో నెలకొన్న వర్షపాతం లోటు, ఎల్‌నినో ప్రభావ పరిస్థితులు, నాగార్జునసాగర్ కుడి కాలువ ద్వారా సాగునీటి విడుదలకు అవకాశం లేని పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు వరి సాగు చేపట్టవద్దని జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల సూచించారు. అందుబాటులో ఉన్న పరిమిత నీటిని పొదుపుగా వినియోగిస్తూ తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని కోరారు.

కలెక్టరేట్‌లో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో ఖరీఫ్ 2026 పంటల పరిస్థితి, వర్షపాతం లోటు, నీటి లభ్యత, ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనే కార్యాచరణపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో సాధారణ వర్షపాతం 270.75 మి.మీ. కాగా ఇప్పటివరకు 162.52 మి.మీ. మాత్రమే నమోదై 39.97 శాతం లోటు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఖరీఫ్‌లో సాధారణ పంట విస్తీర్ణం 1,57,932 హెక్టార్లు కాగా ఇప్పటివరకు 39,758 హెక్టార్లలో సాగు చేపట్టినట్లు వివరించారు.నీటి లభ్యతపై స్పష్టత లేని పరిస్థితుల్లో వరి సాగు చేపట్టి మధ్యలో నీటి కొరత ఏర్పడితే రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. వరికి బదులుగా మొక్కజొన్న, కంది, మినుము, పెసర, సజ్జ, కొర్ర, వరిగ, ఆముదం, కూరగాయలు, గడ్డి జొన్న వంటి తక్కువ నీటి అవసరమయ్యే పంటలను సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.ప్రతి రైతు సేవా కేంద్రం పరిధిలో ప్రత్యామ్నాయ పంటలపై రైతుల ఆసక్తి, సాగు విస్తీర్ణ వివరాలను సేకరించి మండలాల వారీగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. 'రైతన్న మీకోసం' కార్యక్రమం ద్వారా గ్రామస్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలని, రైతులకు కరపత్రాల ద్వారా ప్రస్తుత నీటి పరిస్థితి, వరి సాగు వల్ల కలిగే ఇబ్బందులు, ప్రత్యామ్నాయ పంటల ప్రయోజనాలను వివరించాలని ఆదేశించారు.వర్షపు నీటిని నిల్వ చేయడం, భూగర్భ జలాలను పెంపొందించడం కోసం చిన్న, సన్నకారు రైతుల పొలాల్లో నీటి గుంటల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీని కలెక్టర్ ఆదేశించారు. "నీరు ఉన్నప్పుడే వరి.. నీరు లేని పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటలే రైతుకు రక్షణ" అనే సందేశాన్ని రైతుల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు.